క్లుప్తంగా

భద్రతతో కూడిన ప్రయాణం క్షేమం



దాచేపల్లి : భద్రతతో కూడిన ప్రయాణం ప్రాణానికి క్షేమమని సీఐ షేక్ బిలాలుద్దీన్ అన్నారు. మండలంలోని పెదగార్లపాడు గ్రామ సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు శనివారం నిర్వహించారు. డ్రైవింగ్‌పై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోవద్దని, సురక్షితమైన ప్రయాణం చేయాలని సీఐ బిలాలుద్దీన్ చెప్పారు. డ్రైవింగ్ చేసేటప్పుడు కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని, మీ ప్రయాణం కుటుంబానికి మేలు కరంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ దాసరి శివనాగరాజు, ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్. సీతారాములు, ప్రేమ్‌కుమార్, సీఎస్‌వో మూర్తి, హెచ్‌ఆర్ మేనేజర్ షేక్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి నియోజకవర్గ స్థాయి టోర్నమెంట్

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మి నరసింహాస్వామి 67వ కల్యాణ మహోత్సవం సందర్భంగా ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు నియోజకవర్గ స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి షీల్డ్‌తో పాటు మొదటి బహుమతిగా రూ.4 వేలు, రెండవ బహుమతిగా రూ.3 వేలు, మూడవ బహుమతిగా రూ.2 వేలు, నాల్గవ బహుమతిగా రూ. వెయ్యిగా అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు మొబైల్ నంబర్ : 8639770086 సంప్రదించాలని తెలియజేశారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దుర్గి: మహిళ శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) మండల పరిధిలోని ఓబులేశునిపల్లె 1, ధర్మవరం 1, అంగన్‌వాడీ కేంద్రాల్లో 2 పోస్టులు ఖాళీలున్నట్లు ఐసీడీఎస్ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 01-07-2023 నాటికి 21సం''రం నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా 7వ తరగతి పాస్ అయి, స్థానికంగా సంబంధిత గ్రామాల్లో నివసిస్తూ వివాహితులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ 01-02-2023 అన్నారు. సంబంధిత కుల ధృవీకరణ పత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రైల్వే స్టేషన్‌లో పలు రైలు ఆగాలని ఎంపీకి వినతి

పిడుగురాళ్ల: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో పలు రైలు ఆగాలని ప్యాసింజర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీ శ్రీ కృష్ణదేవరాయులుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని రాత్రి సమయాల్లో పలు రైళ్లు ఆగక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆగే విధంగా రైల్వే అధికారులతో సంప్రదింపు చేయాలని ఎంపీ దృష్టికి తీసుకొని వచ్చారు. ఈసందర్భంగా ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు మాట్లాడుతూ రైల్వే ఉన్నతాధికారులకు మాట్లాడి పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో రైళ్లు ఆగేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ వున్నం నాగ మల్లిఖార్జునరావు, వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు కుందుర్తి గురవాచారి, రైల్వే స్టేషన్ ప్యాసింజర్ అసోసియేషన్ అధ్యక్షులు జూలకంటి శ్రీనివాసరావు ఉన్నారు.

రైల్వే వంతెన త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీకి వినతి

పిడుగురాళ్లరూరల్: కరాలపాడు గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న రైల్వే ఒంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కరాలపాడు గ్రామస్తులు నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కరాలపాడు, పిడుగురాళ్ల రైల్వే మార్గంలో ఎల్‌సీ నెంబర్ 72వద్ద నూతనంగా నిర్మాణం అవుతున్న రైల్వే వంతెనను నిర్మాణం పూర్తి చేసి సంవత్సరం అవుతుందని తెలిపారు. కానీ కొద్ది రోజులుగా రైల్వే పనులు నిలిపివేయడం వల్ల కరాలపాడు నుంచి పిడుగురాళ్లకు వెళ్లేందుకు ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు, రైతులకు తీవ్ర సమస్య ఎదురైందన్నారు. సంబంధిత అధికారులు స్పందించకపోవడం వల్ల పనులు సాగడం లేదన్నారు. కనీసం నడవటానికి కూడా వీలు లేకుండా ఉందని, అదే మార్గంలో రైతులు పండించిన పంటను తీసుకొని వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈసందర్భంగా ఎంపీ ఫోన్‌లో రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో మండల అధ్యక్షులు చల్లా పిచ్చిరెడ్డి, సర్పంచ్ చల్లా శివారెడ్డి, ఇల్లూరి వెంకట రామిరెడ్డి, నాగిరెడ్డి, చల్లా కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



లబ్ధిదారులకు పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ఇది మనందరి ప్రభుత్వమని అందరి సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఆర్కే శనివారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని నాగమయ్య స్వామి గుడిలో పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే పీఆర్కే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ తూర్పు బజారులో నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఉన్న ప్రతి గడపకు వెళ్లి ఇప్పటి వరకు ఆ ఇంటికి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వారికి ఎమ్మెల్యే పీఆర్కే మౌఖికంగా వివరించి చేకూర్చిన లబ్ధిని తెలిపే కర దీపికలను అందించారు. ప్రతి ఇంటి మహిళలతో నేరుగా మాట్లాడి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అమ్మా అంటూ అడిగి తెలుసుకున్నారు. చాలా చోట్ల మహిళలు ఎమ్మెల్యే పీఆర్కేను సాదరంగా ఆహ్వానించి తమ అభిమానం చాటుకున్నారు.

సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురండి...

సంక్షేమ పథకాలు అందడంలో ఇబ్బందులున్నా, స్థానికంగా సమస్యలున్నాయని గుర్తించిన వెంటనే వాటిని పరిష్కరించాలని పక్కనే ఉన్న అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, చేదోడు, పంటల బీమా, ఈబీసీ నేస్తం, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న తోడు, జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన, కాపు నేస్తం, వివిధ రకాల పెన్షన్లు, రైతు భరోసా, సున్నా వడ్డీ రుణాలు, వాహనమిత్ర, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ, వైఎస్‌ఆర్ బీమా, వైఎస్సార్ చేదోడు వంటి పథకాల ద్వారా గ్రామంలో 4,717 మందికి రూ.11,65,13,393 కోట్ల లబ్ధిని చేకూర్చినట్లు ఎమ్మెల్యే పీఆర్కే వివరించారు. గ్రామంలో 1,182 గడపలుంటే ఒక్కో గడపకు రెండు కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందాయి. ప్రతి గడపకు సగటున రూ.98,573 ఇప్పటి వరకు ప్రభుత్వం అందించింది. కార్యక్రమంలో ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, గ్రామ సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు, ఎంపీటీసీ వేంపోగు నిర్మల, మాజీ సర్పంచ్ పంగులూరి హైమావతి రామకృష్ణయ్య, గమిడి మల్లిఖార్జునరావు, గంటా వీరయ్య, ఉన్నం ఆదిశేషగిరిరావు, ఉన్నం శివయ్య, శంకర్, ఆదినారాయణ, కొటారి శివరామకృష్ణ, కర్నాటి సత్యనారాయణ, చిరుమామిళ్ల శేఖర్, మాగంటి అంకారావు, పంగులూరి కోటయ్య, మల్లిఖార్జునస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బొట్లగుంట రామారావు,వసంత సాంబశివరావు, కర్నాటి శివప్రసాద్,చిరుమామిళ్ల నరసింహారావు, అలుగునూరి అమరయ్య, సూరె చెంచారావు, వెంకటేశ్వర్లు, మోషే, లంకా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్య ఆర్థిక భద్రత

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మార్కొండారెడ్డి



ప్రదర్శనలో ఏఏబి చైర్మన్ సాయిమార్కొండారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి మురళి

కారెంపూడి: చిరు ధాన్యాల వల్ల ఆరోగ్య భద్రత, ఆర్థిక భద్రత చేకూరుతాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ మురళి పేర్కొన్నారు. 2023ను అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని చినకొదమగుండ్ల గ్రామంలో చిరు ధాన్యాల సాగు, వినియోగ ఆవశ్యకతపై శనివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సదస్సులు నిర్వహించి రైతులు, విద్యార్థులకు చిరుధాన్యాల ప్రయోజనాలను వివరించారు. అనంతరం చిరుధాన్యాల ప్రయోజనాలను వివరించే స్లోగన్స్‌తో ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏఏబి చైర్మన్ సాయిమార్కొండారెడ్డి,, డీఏఓ మురళిలు అరికలు, కొర్రలు, ఊదలు, రాగులు, సామలు, వరిగెలు, అండు కొర్రలు, సజ్జల వల్ల చేకూరే ఆరోగ్య ప్రయోజనాలను అదే విధంగా రైతులకు ఈ పంటలు ఏ విధంగా లాభదాయకంగా ఉంటాయో వివరించారు. సమావేశంలో ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ బి యలమందారెడ్డి, డీఏఓ ఆఫీస్ అధికారిణి హైమావతి, చినకొదమగుండ్ల, పెదకొదమగుండ్ల గ్రామ సర్పంచ్‌లు యర్రంరెడ్డి వీరారెడ్డి, మేకపోతుల శ్రీనివాసరెడ్డి , మాజీ సర్పంచ్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, బొమ్మిరెడ్డి నర్సిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు

మాచవరం: చిరుధాన్యాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పిడుగురాళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు బి. శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని శ్రీరుక్మిణీపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా లక్ష్మీకుమారి



మాచర్ల: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు ఏర్పాటు చేసిన ఏపీఎస్ఎస్‌డిసి స్కిల్ హబ్ ఫిబ్రవరి నెల 4న ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా జె లక్ష్మీ కుమారి తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ 18 నుంచి 30సం''రాలు నిండిన మహిళలు, పురుషులు డొమెస్టిక్ ఎంట్రీ ఆపరేటర్, హోం హెల్త్ ఎయిర్ కోర్సులు నేర్పించబడునన్నారు. 3నెలల కాల వ్యవధిలో నేర్పించే ఈ కోర్సులకు 10వ తరగతి పాసైన వారు అర్హులన్నారు. నాన్ రెసిడెన్షియల్ డ్రైవింగ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ శిక్షణ పొందిన వారికి శిక్షణ సర్టిఫికెట్లు జారీ చేయబడునన్నారు. కావున ఆసక్తి కలిగిన అభ్యర్థులు నియోజక వర్గ పరిధిలోని యువతీ యువకులు ప్రభుత్వం తరుపున ఉచితంగా ఇచ్చే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రాజెక్టు మేనేజర్ షేక్ బాజి తెలిపారు. మరిన్ని వివరాలకు : 7842747682 ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

- వైభవంగా స్వామివారి కల్యాణం
- తిరునాళ్లలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్సీ
- మహా అన్నదాన కార్యక్రమం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్సీ జంగా , ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతానికే కొంగుబంగారంగా నిలిచిన పట్టణానికి చెందిన శ్రీ సువర్చల సమేత శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 16వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగవైభవంగా శనివారం జరిగాయి. స్వామివారి కల్యాణోత్సవ, రథోత్సవ తిరునాళ్లలకు భక్తజన భారీ సంఖ్యలో హాజరయ్యారు. రథోత్సవ ప్రారంభ కార్యక్రమానికి నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విఫ్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తిలు ముఖ్యఅతిథిలుగా హాజరై ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవాన్ని నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విఫ్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తిలు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని తెలిపారు. ఇటువంటి స్వామి వారి కల్యాణ, రథోత్సవ పండుగలు రానురాను మరింత వైభవంగా నిర్వహించాలని తెలిపారు. ఈ ప్రాంతంలో సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల అంటే పల్నాడు ప్రాంతానికే ప్రాముఖ్యత పొందిందన్నారు. అనంతరం భక్తులకు అభివాదం చేస్తూ రథాన్ని ముందుకు నడిపించారు.

పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు...

ముందుగా కోటిలింగ మహా శైవక్షేత్ర పీఠాధిపతులు తాళాయిపాలెం శివస్వామి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం, రథ ప్రారంభానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రథోత్సవం తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా ఐలాండ్ సెంటర్, బ్యాంక్ సెంటర్, అడితీల సెంటర్ వరకు కొనసాగింది. తిరిగి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం వరకు ఈ రథయాత్ర జరిగింది. భక్తులు హనుమాన్ రిబ్బన్ కట్టి, జై హనుమాన్, జైజై హనుమాన్, జై శ్రీరాం, జైజై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ యువత, భక్తులు రథాన్ని ముందుకు లాగారు. రథం పురవీధుల గుండా వస్తుండగా ఆయా వీధుల వద్ద ప్రజలు కులమతాలకు అతీతంగా హాజరై రథాన్ని తిలకించారు. మహిళా కోలాట బృందం రథ ఊరేగింపు సమయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతల సహాయంతో హాజరై భక్తులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రథ ఊరేగింపులో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలను పట్టణ సీఐ ఎం. ఘధుసూధన రావు తీసుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రథాన్ని ఒక వైపు తీసుకొని వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ప్రత్యేక పోలీస్ బలగాలను తీసుకొని వచ్చి తిరునాళ్ల మహోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

రూరల్ సీఐ షేక్ షమీముల్లా



రోడ్డు ప్రమాదాల నివారణ పై మాట్లాడుతున్న రూరల్ సీఐ షేక్ షమీముల్లా

మాచర్ల రూరల్: ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత పై అవగాహన కలిగి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రూరల్ సీఐ షేక్ షమీముల్లా కోరారు. శనివారం రూరల్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన 34వ జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నిర్ణీత వయసు దాటిన తర్వాతే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. అతి వేగం ప్రమాదాలను కొని తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. పరిమితి వేగంలో మనం ప్రయాణించే వాహనాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సీటుకు బెల్టు, తలకు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్



నిర్మాణ పనులు చేయించేందుకు పరిశీలన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ , కమిషనర్

మాచర్ల: పట్టణంలోని 9వ వార్డులోని వివిధ సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమయంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ ఈవి రమణ బాబులు శనివారం పరిశీలించారు. కౌన్సిలర్లు జగన్నాధం శివయ్య, మందా సంతోష్‌ల ఆధ్వర్యంలో వారు ఆయా వార్డుల్లో ప్రజలు చెప్పిన సమస్యల పై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో పరిశీలన జరిపారు. డ్రైనేజీలు, రోడ్లు, మంచినీటి సమస్య, బోరింగ్ మరమ్మతులు వెంటనే చెప్పట్టేందుకు వెంటనే చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి చెప్పారు. అక్కడికక్కడే ఉన్న సమస్యల పై దృష్టి సారించి ప్రతిపాదనలు సిద్ధం చేసి సచివాలయం పరిధిలోని 9వ వార్డులో అన్నీ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ బోయ కమిషనర్ రమణబాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేసిన ప్రభుత్వ విప్ పీఆర్కే



దుర్గి: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన యర్రం అనూష కుటుంబ సభ్యులకు రూ. 1లక్ష వైఎస్సార్ బీమా చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి తూచ తప్పకుండా ఆయా సమయాల్లో వారి ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. స్థానిక గ్రామ సచివాలయ సిబ్బంది వలంటీర్లు వారి పరిధిలోని ప్రతి గడపకు వెళ్లి పథకాల వివరాలను తెలిపి అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారులకు మేలును చేకూర్చే విధంగా పనిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారపు లక్ష్మి, వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ జానకిరాము, పంచాయితీ సెక్రెటరీ వెంకటేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా సేవలు అభినందనీయం

మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి

మాచర్ల: మదర్‌థెరిస్సా సేవా సమితి సేవలు ఎంతో అభినందనీయమని ప్రతి సభ్యుడు వారి కుటుంబాల్లో శుభకార్యాల్లో పేదలకు సహాయం చేయడం సంతోషకరమని మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో శివప్రియ నగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలలో 100 మంది విద్యార్థులకు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు తండ్రి బాల వెంకయ్య 10వ వర్ధంతి పురస్కరించుకుని విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్సిల్స్, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మదర్‌థెరిస్సా స్ఫూర్తితో పట్టణంలోని పలువురు సభ్యులు మదర్‌థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో సేవలు చేయడం ఎంతో మంచి వన్నారు. కార్యక్రమానికి సేవా సమితి అధ్యక్షులు కసిరెడ్డి శాంతిరెడ్డి అధ్యక్షత వహించగా, కౌన్సిలర్లు రామిశెట్టి వెంకటేశ్వర్లు, కలివెల కిషోర్, ఆత్మకూరు సర్పంచ్ బొబ్బా నాగిరెడ్డి, సభ్యులు కొణతం ఈశ్వరరెడ్డి, జక్కిరెడ్డి మల్రెడ్డి, కిరీటిరెడ్డి, తుమ్మా మల్రెడ్డి, చిన్నపరెడ్డి, న్యాయవాది సిహెచ్ నాగిరెడ్డి, పి శ్రీనివాసరావు, లక్ష్మి ప్రసన్న, చంద్రశేఖర్, ఏడుకొండలు, ముత్యాల పాపిరెడ్డి, అందుగుల చంద్రయ్య తదితరులున్నారు.

వైభవంగా భావనా ఋషి కల్యాణం



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



మాచవరంలో శ్రీభావనారుషి స్వామి వారి కల్యాణం

గురజాల : మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి కల్యాణ మహోత్సవ వేడుకలు కన్నుల పండువగా శనివారం నిర్వహించారు. ప్రతి ఏడాది రథ సప్తమి పండుగను పురస్కరించుకుని పద్మశాలీయుల ఆధ్వర్యంలో స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆలోచనతో శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే స్వామి వారికి సుప్రభాత సేవతో మొదలై పుణ్యావచనం, అనంతరం దేవాలయంలో ఉన్నటువంటి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టా బంగారంను దేవాలయంలో కొలువై వున్న స్వామి వారి వద్ద వుచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామివార్లను ఉంచి మత్రోచ్ఛరణ మధ్య కళ్యాణ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవంను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం స్వామి వారి కల్యాణానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం వేళ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

స్వామివారిని దర్శించుకున్నవైస్ ఎంపీపీ భావనా ఋషి కల్యాణంను పురస్కరించుకుని వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ ఎంపీపీతో పాటు నాయకులు కావూరి అంజిబాబు, జె నాగేశ్వరరావు, తిరపతిరావు, మరియు గ్రామ పెద్దలు, కుల పెద్దలు పాల్గొన్నారు.

నేడు అన్నప్రసాద వితరణ

స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం అన్నప్రసాద వితరణ చేయడం జరుగుతుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రతి కుటుంబానికి అన్న ప్రసాదం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

మాచవరం: మాచవరంలోని మిషన్‌బావి సెంటర్‌లో పద్మ శాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో శ్రీభద్రావతి సమేత శ్రీభావనారుషి స్వామి 43వ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళ స్నానం, కలశ స్థాపన, స్వామి వారి ప్రభ ఊరేగింపు , పూలు రాల్చుట, స్వామి వారి నైవేద్యం పంపిణీ కార్యక్రమాల అనంతరం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి, మంగళధారణ కార్యక్రమం నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళా భక్తులు

మాచర్ల: పట్టణంలో శనివారం రథసప్తమి సందర్భంగా వివిధ దేవాలయాల్లో భారీ స్థాయిలో అర్చకులు, భక్తులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథసప్తమి పూజా కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో వేంచేసియున్న శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో అర్చకులు, ఆలయ కమిటీ చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో హోమం నిర్వహించారు. రథసప్తమి పురస్కరించుకుని 15వ వార్డులో గీతా ప్రచార మండలి ఆధ్వర్యంలో పలువురు మహిళలు సూర్యభగవానునికి పొంగళ్ళు చేసి ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని ఊరేగింపు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈఓ శ్రీగిరిరాజు నర్సింహబాబు, నిర్వాహకులు వీరాంజనేయరెడ్డి, సీఎంఆర్, పలువురు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. పాత మాచర్లలోని వెంకటేశ్వర దేవాలయాలలో సూర్యభగవానుని రథసప్తమి పూజా కార్యక్రమాలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

వచ్చేనెల 3న నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక

దాచేపల్లి : నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య శనివారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీలోపు కౌన్సిల్ సభ్యులకు, ఎక్స్ ఆఫిషియో సభ్యులకు చైర్మన్ ఎన్నిక సమాచార నోటీసులు తెలియజేస్తామని, ఎన్నికల నిర్వహణ అధికారిగా నియమితులైన గురజాల ఆర్డీఓ కె. అద్దయ్య పర్యవేక్షణలో చైర్మన్ ఎన్నిక జరుగుతుందని ఆమె వెల్లడించారు. 3వ తేదీ ఉదయం 11గంటలకు నగర పంచాయతీ కారాయలయంలో చైర్మన్ ఎన్నిక జరుగుతుందని కమిషనర్ శ్రీవిద్య చెప్పారు. నగర పంచాయతీలో 20 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా వీరిలో వైఎస్సార్ సీపీకి చెందిన 11 మంది, టీడీపీ 7, జనసేన 01, స్వతంత్ర్య 01 కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో వైఎస్సార్ సీపీకి చెందిన 3వ వార్డు కౌన్సిలర్ మునగా రమాదేవి మృతిచెందడంతో వైఎస్సార్ సీపీకి 10 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఈ ఎన్నికలో కౌన్సిలర్స్‌తో పాటుగా ఎక్స్ ఆఫిషియో సభ్యుడిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి కూడా ఓటు హక్కు ఉంటుంది. ఇదిలా ఉండగా నగర పంచాయతీ 3వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన మునగా రమాదేవి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి ఆనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు.